## నోట్‌పుస్తకాలు పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్తీక్

నారాయణపేట టౌన్, జూన్ 4 : తెలుగు జాతి గర్వించదగిన గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యమని జనరల్ ఫిజీషియన్ కార్తీక్ అన్నారు. మంగళవారం ఎస్పీ బాలు జయంతి సందర్భంగా అభిమాన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని బాలకేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ 16 భాషల్లో 45వేలకు పైగా గీతాలను ఆలపించి తెలుగోడి ఘనకీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత గాయకుడన్నారు. బాలు పాటలు నేటి గాయని, గాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఎస్పీ బాలుకు పేట కళాకారులతో ఎంతో అనుబంధం ఉందన్నారు. అనంతరం బాలకేంద్రం విద్యార్థులకు నోటు పుస్తకాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నర్సింహులు, రామకృష్ణ, కల్యాణి, వసంత్, జ్ఞానామృత, లక్ష్మణ్, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

## ఘనంగా గజలమ్మ జాతర



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మొళగన్ కుటుంబ సభ్యులు

నారాయణపేట రూరల్, జూన్ 4 : మండలంలోని జాజాపూర్‌లో మంగళవారం గజలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వంశపరంగా వస్తున్న ఆచారం ప్రకారం మొళగన్ జనార్ధన్ కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం జల్దిబిందె ఊరేగింపు పురవీధుల గూండా చేపట్టారు. సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఎర్రవెంకటప్ప, నర్సప్ప, రాజప్ప, వెంకటప్ప, భీమేష్ పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్

మాగనూర్, జూన్ 4 : మాగనూర్ మండల పరివాక ప్రాంతమైన పెద్ద వాగు నుంచి మాగనూర్, వర్కూర్, దాసర్‌దొడ్డి గ్రామాల్లో ఇష్టానుసారంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. మంగళవారం రాత్రి దాసర్‌దొడ్డికి చెందిన కొందరు వ్యక్తులు వర్కూరు పెద్దవాగు నుంచి మక్తల్‌కు ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా, పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు తనిఖీల్లో పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ అంజప్ప, ఓనర్ వాకిటి లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహ్మద్ అబ్దుల్‌ఖాదర్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బీజేపీ నాయకుల సంబురాలు



మక్తల్‌లో సంబురాలు నిర్వహిస్తున్న నాయకులు

మరికల్, జూన్ 4 : జిల్లాలో అన్ని మండలాల్లో మహబూనగర్ పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థి డీకే అరుణ విజయం సాధించడంతో మంగళవారం పార్టీ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రధాన చౌరస్తాలో పటాకులు కాలుస్తూ, మిఠాయిలు పంచారు. తాండూర్-మహబూబ్‌నగర్ ప్రధాన రాహదరిపై బీజేపీ నాయకులు పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఊట్కూరు, మక్తల్ అడ్డాకులలో, మూసాపేటలో, బాలానగర్‌లో బీజేపీ కార్యకర్తలు పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు.

## పప్పు దినుసు పంటలను సాగు చేయాలి

బిజినేపల్లి, జూన్ 4: రైతులు పప్పు దినుసు పంటలను సాగు చేయడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం గ్రామంలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో పర్వతాపూర్, వసంతాపూర్, ఖానాపూర్, నల్లవెల్లి, ఎత్మతాపూర్ గ్రామాల్లో కందిసాగులో సామూహిక ప్రదర్శనా క్షేత్రాల్లో భాగంగా శిక్షణ, విత్తనం, పంట కీలక ఉత్పాదకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ ఈ సంవత్సరం జాతీయస్థాయిలో జాతీయ ఆహార భద్రత పథకం కింద అధిక మొత్తంలో పప్పు దినుసు పంటలను పోత్సహించడం జరుగుతుందన్నారు. కందిపంట ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం రైతులకు కంది సాగు విషయాలతోపాటు నాణ్యమైన విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రాజశేఖర్, రామకృష్ణ, రైతులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-327729-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794



మూసాపేట శివారులో సాగుచేసిన జొన్నపంట (ఫైల్)

- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి
- మార్కెట్లో భారీగా పలుకుతున్న ధర
- రొట్టెలకు పెరుగుతున్న డిమాండ్

### మార్కెట్లో పెరిగిన డిమాండ్..

గతంలో జొన్నలు క్వింటాకు ధర రూ.3వేల నుంచి రూ.5వేల మధ్య ఉండేది. గతేడాది రూ.8వేల నుంచి మేలు రకం(చెలుక పచ్చ) జొన్నలకు రూ.11వేల వరకు ధర పలికింది. అంటే జొన్నలకు డిమాండ్ డబుల్ పెరిగింది. ఈ కాలంలో రైతులు జొన్న పంట సాగు చేస్తే మంచి లాభాలు పొందవచ్చు. ఆరుతడి పంటల్లో జొన్న పంటకే పెట్టుబడి, శ్రమ తక్కువగా ఉంటుంది. మిగతా పంటల రాబడితో పోలిస్తే జొన్నలోనే మంచి లాభాలు వస్తాయని రైతులు చెబుతున్నారు. అంతేకాక పంటను అమ్ముకునేందుకు కూడా రైతులు ఇబ్బందులు పడాల్సిన అసవరం ఉండదు. వారి వద్దకే వ్యాపారులు వెళ్తారు. రైతులు జొన్న పంటను సాగు చేయడం వల్ల లాభం పొందడంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిన వారవుతారు. రైతులు ఈ సీజన్‌లో జొన్న పంట సాగుకు ఆసక్తి చూపాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

# జొన్నసాగు.. లాభాలు బాగు



జొన్నలు

మూసాపేట, జూన్ 4 : ఉరుకుల పరుగుల జీవితంలో అనారోగ్య సమస్యలతో అనేక మంది సతమతమవుతున్నారు. 35ఏండ్ల నుంచే బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో చిరుధాన్యాలకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. ఇందులో ముఖ్యంగా జొన్నరొట్టెకు డిమాండ్ పెరిగింది. దశాబ్ద కాలంలో అత్యధికంగా డిమాండ్ పెరిగిన పంటల్లో జొన్న ఒకటి. ప్రస్తుతం పల్లె-పట్టణం, పేద-ధనిక తేడా లేకుండా అందరూ జొన్నరొట్టె తినేందుకే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. పూర్వం ప్రతి రైతు జొన్నలు, తైదలు పండించేవారు. వాటితో ఏడాది పొడవునా రొట్టె, సంకటి చేసుకొని తినేవారు. అందుకే వారికి 70, 80 ఏండ్లు వచ్చినా బీపీ, షుగర్ వంటి వ్యాధులు వచ్చేవికావు. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా ఉంటూ తమ పనులు చేసుకునేవారు. సన్న బియ్యం వచ్చిన తర్వాత అందరూ జొన్న, తైద పంటలు పండించేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో మూడు దశాబ్దాలుగా అందరూ రొట్టెలను పక్కన పెట్టి మూడుపూటలు అన్నం, బియ్యంతో తయారు చేసిన ఇడ్లీలు, దోశ తింటూ వస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఆరోగ్యం ఆవిరైపోయింది. 35ఏండ్లు దాటితే బీపీ, షుగర్ వంటి వ్యాధులతో పాటు స్థూలకాయం, గుండెజబ్బులతో నిత్యం సతమతమవుతూ జీవనం సాగిస్తున్నారు. వైద్యుడిని సంప్రదిస్తే ఎక్కువగా జొన్న రొట్టె తినాలని, రాగి జావా తాగాలని సూచిస్తుండడంతో రెండేళ్లుగా మార్కెట్‌లో జొన్నరొట్టెకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుత సమాజంలో 40 ఏండ్లు దాటిన 60శాతం మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు. రొట్టె తినడం వల్ల వ్యాధి నియంత్రణలో ఉంటుందని తెలియడంతో వ్యాధిగ్రస్తులతోపాటు మిగతా వారు కూడా రొట్టెలపై ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో రొట్టెలు చేసే మహిళలకు జీవనోపాధి లభిస్తున్నది. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రోడ్ల పక్కన కట్టెల పొయ్యిలు పెట్టి వచ్చిన వారికి వేడివేడి రొట్టెలు చేసి ఇస్తున్నారు. ఇలా చాలా కుటుంబాలు రొట్టెల తయారీతో కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా జొన్న సాగు తగ్గిపోయింది. గ్రామాల్లో ఆశించిన స్థాయిలో పంట సాగుకాకపోవడంతో దిగుబడి చాలా తగ్గింది. దీంతో జొన్నలకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతూ వస్తున్నది.

## మూల్యాంకనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- డీఐఈవో శ్రీధర్‌సుమన్



మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో శ్రీధర్‌సుమన్

పాలమూరు, జూన్ 4 : ఈనెల 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ స్పాట్ వాల్యువేషన్ నిర్వహిస్తున్నట్లు క్యాంప్ అధికారి, జిల్లా మాధ్యమిక విద్యాధికారి శ్రీధర్‌సుమన్ తెలిపారు. మంగళవారం మూల్యాంకన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఐదు జిల్లాల ప్రిన్సిపాళ్లు, జూనియర్ కళాశాలల లెక్చరర్లు ఈ మూల్యాంకనంలో పాల్గొనున్నారని తెలిపారు. మొదటి స్పెల్ 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, సంస్కృతం, తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, ఎకనామిక్స్‌కు సంబంధించిన ఏడు సబ్జెక్టుల అధ్యాపకులు పాల్గొననున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లాల వారీగా మూల్యాంకన సిబ్బంది వివరాలను తెలియజేస్తూ జోగులాంబ గద్వాల 92, వనపర్తి 181, నాగర్‌కర్నూల్ 171, మహబూబ్‌నగర్ 221, నారాయణపేట 110, మొత్తం 775మంది మొదటి స్పెల్ మూల్యాంకనం లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. నీళ్లు, ఫ్యాన్లు, డ్యుయల్ డెస్కులు, వాష్‌రూంలు, క్యాంటిన్ తదితర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మూల్యాంకన సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉదయం 15 పేపర్లు, మధ్యాహ్నం 15 పేపర్లు ముదింపు చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. క్యాంప్ వేళలను ఖచ్చితంగా పాటించాలని, లేదంటే చర్యలు తప్పవన్నారు. సెల్‌ఫోన్లు చీఫ్ ఎగ్జామినర్ల వద్ద ఉంచాలని, మూల్యాంకన సమయంలో ఎట్టిపరిస్థితుల్లో ఫోన్లనువద్ద ఉంచుకోరాదన్నారు. అనధికార వ్యక్తులను క్యాంప్‌లోకి అనుమతించరాదని, తప్పనిసరిగా ఐడీకార్డులను ధరించాలని సూచించారు. ఆయా జిల్లాల్లో మూల్యాంకన సిబ్బందిని తప్పక రిలీవ్ చేసేలా కళాశాలలకు బోర్డు ఆదేశాలు జారీ చేసిందని, రిలీవ్ చేయని కళాశాలలకు నోటీసులు జారీ చేసి పెనాల్టీలు విధిస్తామన్నారు.

## స్వల్పంగా పెరిగిన ధాన్యం ధరలు

జడ్చర్ల, జూన్ 4 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం ధరలు మంగళవారం స్వల్పంగా పెరిగాయి. సోమవారం క్వింటా రూ.2,525 ధర పలుకగా, మంగళ వారం రూ.2,559 పలికింది. 775క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం రాగా, గరిష్ఠంగా రూ.2,559, కనిష్ఠంగా రూ.1,905, మధ్యస్తంగా రూ. 2,359 ధర పలికింది. 12క్వింటాళ్ల హంసరకం ధాన్యం అమ్మకానికి రాగా, గరిష్ఠంగా రూ.1,817, మొక్కజొన్న 488 క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.2388, వేరుశనగ 21క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.5,886 ధర పలికింది.

## ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



కాల్వలో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు

కృష్ణ, జూన్ 4 : మండలంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మండలంలోని గుడెబల్లూర్‌లో పొదళ్ల వద్ద కలుపు మొక్కలు తొలగించడం, మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం, కాల్వల్లో పూడికతీత పనులను చేపట్టారు. జాబ్‌కార్డు కలిగిన వారు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

## ఘనంగా బోనాలు



వ్రతాలను నిర్వహిస్తున్న భక్తులు

దేవరకద్ర, జూన్ 4 : మండలంలోని బస్వాయిపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపనలో భాగంగా మంగళవారం గ్రామదేవతల ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు బోనాలతో బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా మహిళలు బోనాలతో గ్రామ పురవీధుల గూండా ర్యాలీగా వచ్చి బొడ్రాయి చుట్టు ప్రదక్షిణలు చేసి అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతం

భూత్పూర్, జూన్ 4 : పట్టణ కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మాసశివరాత్రిని పురస్కరించుకొని మాతృమండలి ఆధ్వర్యంలో ఉమాగౌరీశంకరుల వ్రతాన్ని నిర్వహించారు. లోకకల్యాణం కోసమే ఈ వ్రతాలను ప్రతి నెల మాసశివరాత్రి రోజున నిర్వహిస్తున్నట్లు మాతృమండలి సభ్యురాలు పుష్పమ్మ తెలిపారు. ఆలయ అర్చకుడు మంజునాథస్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో లక్ష్మమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- కంకరతేలి రాకపోకలకు అవస్థలు



రాచాల, నాగాయపల్లి మట్టి రోడ్డు

మూసాపేట(అడ్డాకుల), జూన్ 4 : రెండు మండలాలను అనుసంధానం చేసే రోడ్డును బీటీగా మార్చేందుకు మోక్షమెప్పుడు వస్తుందోనని ప్రజలు ఎదరు చూస్తున్నారు. దారిపొడవునా కంకరతేలి రాకపోలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడ్డాకుల మండలంలోని రాచాల నుంచి నాగాయపల్లి మీదుగా మూసాపేట మండలంలోని నందిపేట, వేముల గ్రామాల వెళ్లే క్రాస్‌రోడ్డు వరకు చాలాఏండ్ల క్రితం కంకర రోడ్డు వేసి వదిలేశారు. దీంతో ఆ రోడ్డు పొడవునా కంకర తేలడంతో పాటు, గుంతలమయంగా మారి రోడ్డుపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ప్రతిరోజూ ఆ రోడ్డు మార్గాన వెళ్లే వారు తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ప్రధానంగా నాగాయపల్లి గ్రామస్తులు అటు రాచాలకు వెళ్లాలన్నా, మూసాపేట మండలం వైపు జాతీయ రహదారికి వెళ్లాలన్నా కంకర రోడ్డు తప్పితే మరోరోడ్డు సౌకర్యం లేదు. దీంతో ఆ గ్రామస్తులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో అన్నీ గ్రామాలకు బీటీ రోడ్డు వేయించారు. కానీ నాగాయపల్లితో పాటు కందూరు అనుబంధ గ్రామం వడ్డెపల్లికి మాత్రమే బీటీరోడ్డు సౌకర్యం లేదు. కానీ నాగాయపల్లి రోడ్డు వేయిస్తే ఆ గ్రామంతో పాటు రాచాల గ్రామస్తులకు జిల్లా కేంద్రానికి, మూసాపేటకు, హైదరాబాద్ వైపు వెళ్లే వారికి దూర భారం తగ్గుతుంది. కావున సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రాచాల నుంచి నాగాయపల్లి మీదుగా నందిపేట క్రాస్ రోడ్డు వరకు బీటీ వేయిస్తే ప్రజలకు రవాణ సౌకర్యంతో పాటు దూర భారం కూడా తగ్గుతుంది.

## డివైడర్‌ను ఢీకొని ఆరుగురికి గాయాలు



క్షతగాత్రులను కర్నూల్ దవాఖానకు తరలిస్తున్న హైవే సిబ్బంది

ఉండవెల్లి, జూన్ 4: హైదరాబాద్ నుంచి కర్నూలు వెళ్తున్న కారు డ్రైవర్ అజాగ్రత్తతో డివైడర్‌ను ఢీకొనగా.. ఆరుగురికి గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన వినయ్, యస్మిత, దీపిక, మనోజ్, మమత, మున్నా డ్రైవర్‌తో కలిసి కారులో కర్నూలుకు వెళ్తున్నారు. ఉండవెల్లి శివారులోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తు, అజాగ్రత్తతో రోడ్డుపక్కనున్న సైడ్ రేలింగ్, డివైడర్‌ను కారు ఢీకొన్నది. ఆరుగురికి తీవ్ర గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో కర్నూల్ దవాఖానకు తరలించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో హోటల్ దగ్ధం

- రూ.7లక్షల ఆస్తినష్టం



చాయ్ తలాబ్‌లో అగ్ని ప్రమాదం సంభవించడంతో వ్యాపిస్తున్న పొగలు

కొత్తకోట, జూన్ 4 : షార్ట్ సర్క్యూట్‌తో టీ స్టాల్ దగ్ధమైన ఘటన కొత్తకోట పట్టణం లో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని బస్టాండ్ కూడలి లో ఉన్న చాయ్ తలబ్ టీస్టాల్‌లో మంగళవారం తెల్లవారుజామున విద్యుదాఘాతం తో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులతోపాటు హోటల్ నిర్వాహకుడైన బాలుకు సమాచారమిచ్చారు. అనంతరం దుకాణం షటర్ తీయగా ఫర్నిచర్‌తోపాటు సామగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. చుట్టుపక్కల మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు. కాగా హోటల్ దగ్ధమైన ఘటనలో సుమారు రూ.7లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు

## మసీదులో కాగితాలు పడ్డాయని ఆందోళన

- బీజేపీ విజయోత్సవ ర్యాలీలో ఘటన
- కమలం నేతలపై కేసు నమోదు చేసిన పోలీసులు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జూన్ 4 : మసీదులో కాగితాలు పడ్డాయని ముస్లింలు ఆందోళన చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం మేరకు.. జిల్లా కేంద్రంలోని టీడీగుట్ట ప్రాంతంలో ఉన్న ఫైర్‌స్టేషన్ పక్కన మసీద్ ఉన్నది. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ఎంపీగా విజయం సాధించడంతో పార్టీ నేతలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో మసీదులో కాగితాలు పడగా.. ముస్లిం యువకులు గమనించి కావాలని వేశారంటూ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. గంటకు పైగా నిరసన తెలడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వన్‌టౌన్ సీఐ అప్పయ్య సిబ్బందితో కలిసి నిరసన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ మేరకు బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.